www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 198 | మంగళవారం | 10 - 12 - 2024 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 8 | వెల : 4

## సబ్ కాంట్రాక్టర్‌పై దాడి



3







- నమూనాను మార్చితే ఊరుకోం.. అవమానిస్తే చట్టపరంగా చర్యలు
- తెలంగాణ సంస్కృతికి రూపమైన బహుజన తల్లి
- జాతి అస్తిత్వానికి ప్రతీకగా విగ్రహ రూపకల్పన
- 9మంది ఉద్యమకారులకు రూ.కోటి, 300 గజాలు
- అసెంబ్లీ, విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్

### ప్రతి ఇంట్లోని కన్న తల్లిలా

# తెలంగాణ తల్లి

తొలిఅడుగు, హైదరాబాద్ : తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూస్తే ప్రతి ఇంట్లోని కన్నతల్లిని చూసిన భావన కలుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరికీ అమ్మను చూసిన భావన కలిగేలా విగ్రహాన్ని రూపొందించామని చెప్పారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, అస్తిత్వం ఉట్టిపడేలా బహుజనుల తెలంగాణ తల్లిగా రూపొందించామన్నారు. విగ్రహ రూపకల్పన సందర్భంలో రెండు అంశాలు ప్రస్తావనకు వచ్చాయని, దేవతలా ఉండాలా? సొంత మాతృమూర్తిలా ఉండాలా? అన్న చర్చ జరిగిందని పేర్కొన్నారు. దేవత గుడిలో ఉంటుందని, తల్లి ఇంట్లో ఉంటుందని, మనల్ని ఒడిలో పెట్టుకుని పెంచుతుందని గుర్తు చేశారు. పైగా అందుకే తల్లి రూపమే ఉండాలన్న అభిప్రాయాల మేరకు బహుజనుల తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని వెల్లడించారు. సోమవారం అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 10.30 గంటలకు సభ ప్రారంభం కాగానే.. స్పీకర్ ప్రసాద్‌కుమార్ అనుమతితో తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారు. అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడారు. "తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన సందర్భంలో రెండు అంశాలు చర్చకు వచ్చాయి. విగ్రహం.. వజ్ర వైడూర్యాలు, కిరీటాలు, భుజకీర్తులతో దేవతలా ఉండాలా? లేక మనల్ని గుండెల్లో పెట్టుకుని చూసుకునే మన అమ్మలా ఉండాలా? అనే ప్రస్తావన వచ్చింది. మేధావులు, ఉద్యమకారులు, కవులు, కళాకారులందరూ తెలంగాణ తల్లి విగ్రహం మన తల్లిలా ఉండాలని అభిప్రాయపడ్డారు. దేవత గుడిలో ఉంటుంది.. తల్లి మన ఇంట్లో ఉంటుంది. తల్లి ఒడిలోనే 2

## భారత్ భద్రతకే బంగ్లాదేశ్ ముప్పు



### సెక్యూరిటీ క్లియరెన్స్ లేకుండానే పాక్ పౌరులకు వీసా

తొలిఅడుగు, న్యూఢిల్లీ : పాకిస్థాన్ మారణహోమాలను అడ్డుకుని.. తన ఆవిర్భావానికి సహకరించిన భారత్ భద్రతకే బంగ్లాదేశ్ ఇప్పుడు ముప్పు తలపెడుతోంది. పాక్‌కు నానాటికీ చేరువవుతూ దానిని సంతృప్తిపరిచేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. బంగ్లాదేశ్ 2

## మహా కుంభమేళాకు 13వేల రైళ్లను నడిపించనున్న రైల్వే



తొలిఅడుగు, న్యూఢిల్లీ : వచ్చే ఏడాది జరుగనున్న మహా కుంభమేళా కోసం భారతీయ రైల్వే భారీగా రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. దాదాపు 45 రోజుల పాటు 34వేల రైళ్లను అందుబాటులోకి 2

## భూస్వాములపై మోహన్ బాబు పోస్ట్



తొలిఅడుగు, హైదరాబాద్ : సీనియర్ నటుడు మోహన్ బాబు కుటుంబ కలహాలు మరోసారి బయటపడ్డాయి. మోహన్ బాబు, ఆయన చిన్న కుమారుడు మంచు మనోజ్ మధ్య ఘర్షణ జరిగినట్టుగా నిన్నటి నుంచి వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. సోషల్ మీడియాలోనూ ఇది హాట్ టాపిక్ గా మారింది. ఈ నేపథ్యంలో మోహన్ బాబు ట్విట్టర్ పోస్టులు చర్చనీయాంశంగా మారాయి. తాజాగా ఆయన తన ఎక్స్ హ్యాండిల్ లో 1998 విడుదలైన శ్రీరాములు సినిమాలోని ఓ సీన్ ను పోస్ట్ చేశారు. 2

## మిస్సింగ్ కేసులు కలకలం

### పారిపోయిన టెన్తు విద్యార్థుల కథ సుఖాంతం





తొలిఅడుగు, అమరావతి : తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుండి పారిపోయిన టెన్తు విద్యార్థుల కథ సుఖాంతం అయింది. తిరుపతి నుంచి ధర్మవరం వైపు రైల్లో పారిపోతున్న ముగ్గురు విద్యార్థులను అన్నమయ్య జిల్లా ములకలచెరువు పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో ఈస్ట్ పోలీసులు తిరుపతికి తీసుకొచ్చారు. అర్ధరాత్రి తల్లిదండ్రులకు విద్యార్థులను పోలీసులు అప్పగించారు. తిరుపతి నగరంలో వరస మిస్సింగ్ కేసులు కలకలం రేపుతున్నాయి. పలు కారణాలతో అదృశ్యం 2

## కెనడాలో మరో భారతీయుడి హత్య



తొలిఅడుగు, న్యూఢిల్లీ : కెనడాలో భారతీయులపై దాడులు పెరిగిపోతున్నాయి. ఈ నెల 1న బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థి గురసిస్ సింగ్ (22)ను రూమ్‌మేట్ హత్య చేయగా, ఈ నెల 6న సెక్యూరిటీ గార్డ్ హర్షణ్‌దీప్ సింగ్ (20)ని కాల్చి చంపేశారు. హర్షణ్‌దీప్ 2

## పవన్ కళ్యాణ్‌కు బెదిరింపు కాల్



తొలిఅడుగు, అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్ రావడం కలకలం రేపుతోంది. డిప్యూటీ సీఎం పవన్‌ను చంపేస్తామని హెచ్చరిస్తూ ఓ ఆగంతకుడి 2

## తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు 16వ తేదీకి వాయిదా




తొలిఅడుగు, హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ, మండలి సమావేశాలు ఈ నెల 16వ తేదీకి వాయిదా పడ్డాయి. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ ప్రకటనపై సభ్యులు మాట్లాడిన తర్వాత సభను 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు 2

## రొచ్చగొట్టే ప్రకటనలకు స్పందించ వద్దు



2

## భారత్ భద్రతకే బంగ్లాదేశ్ ముప్పు



మొదటిపేజీ తరువాయి

వీసా కోసం దరఖాస్తు చేసుకునే పాక్ పౌరులు భద్రతాపరమైన నిరభ్యంతర పత్రాన్ని తీసుకోవాలన్న నిబంధనను తీసివేసింది. పాక్‌లోని కరాచీ నుంచి బంగ్లాలోని చిట్టగాంగ్ వరకు సరుకు రవాణా నౌకలను నేరుగా అనుమతించాలని కూడా బంగ్లాదేశ్ నిశ్చయించింది. దీనివల్ల పాక్ ఉగ్రవాద సంస్థల నేతలు యథేచ్ఛగా బంగ్లాలోకి అడుగుపెట్టి.. తనను నష్టపరిచే కార్యకలాపాలు చేపడతారని భారత్ ఆందోళన వ్యక్తంచేస్తోంది. కాగా, ఇస్కాన్ భక్తులకు ఇస్లామిక్ ఛాందసవాదుల నుంచి బెదిరింపులు పెరుగుతున్నాయని ఇస్కాన్ ప్రతినిధి రాధారామ్ దాస్ అన్నారు.

# రెచ్చగొట్టే ప్రకటనలకు స్పందించ వద్దు

**తొలిఅడుగు, కోల్‌కతా:** బంగ్లాదేశ్ నేషలిస్ట్ పార్టీ నేతలు భారత భూభాగాలపై ఇటీవల చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. బెంగాల్, ఒడిశా, బీహార్‌లోని కొన్ని ప్రాంతాలను ఆక్రమించుకుంటామంటూ వారు చేసిన వ్యాఖ్యలపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తాజాగా నిప్పులు చెరిగారు. విదేశీ శక్తులు భారత భూభాగాలను ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తే భారతీయులు 'లాలీపాప్'లు తింటూ కూర్చుంటారా? అని ప్రశ్నించారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో మమతా బెనర్జీ మాట్లాడుతూ, పరిస్థితులకు అనుగుణంగా కేంద్రం తీసుకునే ఎలాంటి నిర్ణయానికైనా పశ్చిమబెంగాల్ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఇదే సమయంలో బంగ్లాదేశ్‌లో కొందరు చేస్తున్న రెచ్చగొట్టే ప్రకటనలకు స్పందించ వద్దని, ప్రశాంతంగా ఉంటూ సంయమనం పాటించాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బంగ్లాదేశ్‌లోని మైనారిటీ కమ్యూనిటీలకు పశ్చిమబెంగాల్ సంఘీభావం తెలుపుతోందని, సరిహద్దుల్లో శాంతి, సామరస్యాలకు కట్టుబడి ఉంటామని చెప్పారు. "హిందువులు, ముస్లింలు సహా అందరిలోనూ ఒకే రక్తం ప్రవహిస్తోంది. పశ్చిమబెంగాల్‌లో పరిస్థితి తీవ్రతరం కాకుండా అంతా కలిసికట్టుగా ఉండాలి" అని మమతా బెనర్జీ కోరారు. భారత



విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ బంగ్లాదేశ్‌లో పర్యటిస్తుండటాన్ని మమతా బెనర్జీ ప్రస్తావిస్తూ, బంగ్లాదేశ్ అధికారులతో ఆయన అత్యున్నత స్థాయి భేటీ జరుపుతున్నారని, ఇక్కడి వారు అనవసరంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని సూచించారు.

## మహా కుంభమేళాకు 13వేల రైళ్లను నడిపించనున్న రైల్వే

మొదటిపేజీ తరువాయి తీసురానున్నది. మహా కుంభం జనవరి 13న పుష్య పౌర్ణిమ రోజున మొదలై.. ఫిబ్రవరి 26న మహాశివరాత్రి రోజున ముగుస్తుంది. కుంభమేళా సందర్భంగా కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో ఆయన మాట్లాడారు. ప్రయాగ్‌రాజ్ మహాకుంభ మేళా కోసం నాలుగు రింగ్ రైల్ సర్కిల్స్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. వీటిలో వారణాసి–ప్రయాగ్‌రాజ్, ప్రయాగ్‌రాజ్–అయోధ్య, అయోధ్య–కాశీ, ప్రయాగ్‌రాజ్ సర్కిల్‌ను ఏర్పాటు చేశామన్నారు. దేశంలోని 50 నగరాల నుంచి ప్రయాగ్‌రాజ్‌కు ప్రత్యేక రైళ్లు నడుస్తాయని తెలిపారు. ప్రయాగ్‌రాజ్‌కు నేరుగా కనెక్టివిటీ ఉంటుందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. చెన్నై, ముంబయి సహా 50 నగరాల నుంచి ప్రయాగ్‌రాజ్‌కు రిజర్వ్ చేయబడిన రైళ్లు నడుస్తాయన్నారు. కుంభమేళాకు ఈ సారి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా స్టేషన్‌లో కలర్ కోడింగ్ ఏర్పాటు చేశారు. ఇదే విధానాన్ని కుంభమేళాలో ఏర్పాటు చేయనున్నారు. కలర్ కోడ్ ద్వారా ప్రయాణికులు నిర్దేశించిన ప్లాట్‌ఫారమ్ చేరుకుంటారు. ప్రయాణికుల షెల్టర్లు నాలుగు వేర్వేరు రంగుల్లో ఉంటాయి. ఓ ప్రయాణికుడు లక్నోకు వెళ్లాల్సి వస్తే.. అతను నీలం రంగు షెల్టర్ గుండా వెళ్లాల్సి ఉంటుంది. ప్రయాణీకుల టికెట్ సైతం నీలిరంగులోనే ఉంటుంది. షెల్టర్ నుంచి ప్లాట్‌ఫారమ్‌కు వెళ్లే మార్గంలో బ్లూ కలర్ ఇండికేటర్స్‌ని అమరుస్తారు. సంగం సిటీలో మొత్తం 23 ప్యాసింజర్ షెల్టర్స్‌ను నిర్మించినట్లు అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. అన్ని స్టేషన్లలోని షెల్టర్, వెయిటింగ్ రూమ్‌ల వద్ద, రైల్వే ఉద్యోగులు మొబైల్ టికెటింగ్ మెషీన్ల ద్వారా ప్రయాణీకులకు టికెట్లు అందిస్తారన్నారు. మొబైల్ యాప్ ద్వారా సాధారణ టికెట్లు పొందే అవకాశం ఉంటుందన్నారు. 554 అన్‌రిజర్వ్‌డ్ టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇక 18వేల మంది ఆర్పీఎఫ్, జీఆర్పీ జవాన్లను మోహరించనున్నారు. అదే సమయంలో దేశం నలుమూలల నుంచి వివిధ జోన్లకు చెందిన 13వేల మంది రైల్వే అధికారులు, ఉద్యోగులను ప్రయాగ్‌రాజ్‌కు రప్పిస్తున్నారు.

## కెనడాలో మరో భారతీయుడి హత్య

మొదటిపేజీ తరువాయి కేసులో ఇద్దర్ని అరెస్ట్ చేసినట్లు ఎడ్మంటన్ పోలీసులు ప్రకటించారు. శుక్రవారం రాత్రి 12.30 గంటల సమయంలో తమకు సమాచారం అందిన వెంటనే అపార్ట్‌మెంట్‌కు వచ్చి చూశామని, స్పృహలేని స్థితిలో ఉన్న హర్షణ్‌దీప్‌ను దవాఖానకు తరలించామని, ఆయన మరణించినట్లు వైద్యులు ప్రకటించారని పోలీసులు చెప్పారు. సీసీటీవీ ఫుటేజ్‌లో ముగ్గురు దుండగులు హర్షణ్‌దీప్‌పై దాడి చేసినట్లు కనిపించింది.

## భూస్వాములపై మోహన్ బాబు పోస్ట్

మొదటిపేజీ తరువాయి భూస్వాములకు వ్యతిరేకంగా తాను నటించిన ఈ పాత్రను గుర్తుచేస్తూ.. డైరెక్టర్ శంకర్, నిర్మాత పరిటాల సునీత, అందులోని పాత్రధారులను అభినందిస్తూ పోస్టు పెట్టారు. ఈ సీన్ లో మోహన్ బాబు పాత్ర ఆస్తి తగాదాల మధ్య ఆఖరికి ప్రాణాలు కోల్పోయినట్టుగా ఉన్న సీన్ ను ఆయన పోస్ట్ చేశారు. ఇది చూసిన నెటిజన్లు ఇంతకీ ఇప్పుడీ పోస్టు పెట్టడానికి గల కారణం ఏంటి? అని కామెంట్లు పెడుతున్నారు. ఓ వైపు ఆయన కుటుంబంలో ఆస్తుల కోసం కుమారులు కుమ్ములాడుకుంటున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. ఈ సమయంలో మోహన్ బాబు తన పాత సినిమా సీన్లను పోస్టు చేయడం ఆసక్తికరంగా మారింది. ఇందులో ఏదో మీనింగ్ ఉందని కొందరు అంటుంటే.. మోహన్ బాబు ఇష్యూని డైవర్ట్ చేసే ప్రయత్నం చేస్తున్నారా అని మరికొందరు చర్చించుకుంటున్నారు.

# పవన్ కళ్యాణ్‌కు బెదిరింపు కాల్

ఫోన్ చేసి బెదిరింపులకు దిగాడు. పవన్ కల్యాణ్‌ను ఉద్దేశిస్తూ అభ్యంతకర భాషలో హెచ్చరిస్తూ మెసేజ్‌లు పంపించాడు దుండగుడు. దీంతో పేషీ సిబ్బంది బెదిరింపు కాల్స్, మెసేజ్‌ల గురించి ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బెదిరింపు కాల్స్ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెంటనే తెలియజేశారు. ఘటనపై రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఫోన్ కాల్స్, మెసేజ్‌లు పెట్టిన నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు బెదిరింపు ఫోన్ కాల్స్‌పై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ఆరా తీశారు. మెసేజ్‌లు , ఫోన్ కాల్స్ వివరాలను ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే ఘటనపై చర్యలు తీసుకోవాలని, నిందితులను వెంటనే అరెస్టు చేయాలంటూ హోంమంత్రి ఆదేశాలు జారీ చేశారు. దీని వెనక ఎవరు ఉన్నా వదిలిపెట్టేది లేదని ఆమె హెచ్చరికలు జారీ చేశారు. హోంమంత్రి ఆదేశాల మేరకు ఫోన్ కాల్స్ ఎక్కడి నుంచి వచ్చాయనే దానిపై సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి సారించారు. ఇటీవలే రేషన్ మాఫియాపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉక్కుపాదం మోపారు. పవన్ స్వయంగా కాకినాడ పోర్టుకు వెళ్లి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. సముద్రం లోపలికి వెళ్లిన ఓడలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యాన్ని పవన్ పట్టుకుని కేసులు నమోదు చేయించారు. ఈ సంఘటన తర్వాతే ఆయన పేషీకి బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఈ బెదిరింపుల వ్యవహారంలో రేషన్ అక్రమ రవాణా మాఫియా హస్తం ఏమైనా ఉందా? అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరిపే అవకాశం ఉంది.

# పారిపోయిన టెన్తు విద్యార్థుల కథ సుఖాంతం

మొదటిపేజీ తరువాయి అవుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. తల్లిదండ్రులు మందలించారని, భర్తతో గొడవ, కుటుంబ, ఆర్థిక సమస్యలు వంటి కారణాలతో ఇంటి నుంచి వెళ్లిపోతున్నారు. మరోవైపు కిడ్నాప్ కేసులు సైతం వెలుగు చూస్తున్నాయి. అయితే తాజాగా ఒకే రోజు ఆరుగురు ఇంటి నుంచి అదృశ్యం కావడం ఆందోళనకు గురి చేస్తోంది.

– అదృశ్యమైంది వీరే..

తిరుపతిలో తల్లిదండ్రులు మందలించారని ముగ్గురు పదో తరగతి విద్యార్థులు ఇంటి నుంచి పారిపోయారు. తాము రైలు ఎక్కి వెళ్లిపోతున్నట్లు ఫోన్ చేసిన విద్యార్థులు తల్లికి సమాచారం అందించారు. ఏదో విషయంలో తప్పు చేశారని రవిశంకరాచారి, పవన్, రానా అనే ముగ్గురు కుమారులను తల్లిదండ్రులు మందలించారు. తల్లిదండ్రులు తిట్టడంతో మనస్తాపానికి గురైన విద్యార్థులు ఇంటి నుంచి వెళ్లిపోయారు. తాము పారిపోతున్నట్లు తల్లికి సమాచారం అందించారు. దీంతో బాధిత కుటుంబం తూర్పు పోలీసులను ఆశ్రయించింది. తమ ముగ్గురు పిల్లలు కనపడటం లేదని, వారిని రక్షించి తీసుకురావాలని ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు చిన్నారుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. తిరుపతి నుంచి ధర్మవరం వైపు రైల్లో పారిపోతున్న ముగ్గురు విద్యార్థులను అన్నమయ్య జిల్లా ములకలచెరువు పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

# తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు 16వ తేదీకి వాయిదా

మొదటిపేజీ తరువాయి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. అయితే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు నిప్పులు చెరిగారు. అక్రమ అరెస్టులపై మండిపడ్డారు. అదానీ – రేవంత్ దోస్తానాపై ప్రశ్నిస్తామనే భయంతోనే తమను అడ్డుకుంటున్నారని, సభకు రానివ్వడం లేదని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు.

# ప్రతి ఇంట్లోని కన్న తల్లిలా తెలంగాణ తల్లి

మొదటిపేజీ తరువాయి మనం పెరుగుతాం కాబట్టి.. తెలంగాణ తల్లి కావాలని చెప్పారు. తల్లి ప్రతిరూపాన్ని పెట్టుకోవాలని సూచించారు. ఆ మేరకే ప్రతి ఇంట్లో కన్న తల్లిని చూసినట్లుగా ఉండే విగ్రహాన్ని రూపొందించాం" అని సీఎం అన్నారు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకోవడానికి ఈ తెలంగాణ సమాజం శక్తినంతా కూడదీసుకుని వీరోచితంగా పోరాటం చేసిందని సీఎం రేవంత్ అన్నారు. ఆ పోరాటాల్లో ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలు ప్రత్యేక భూమికను పోషించాయన్నారు. "ఉన్నత విద్య కోసం, తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం తండాలు, గూడేలు, మారు మూల పల్లెల్లోని పేదలు, అత్యంత నిరుపేదలైన బహుజనులు తమ పిల్లలను ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలకు పంపించారు. కానీ, ఆ విద్యార్థులు చదువొక్కటే కాదు.. సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల పరిష్కారా నికి కూడా పోరాటం చేయాలని భావించారు. లక్షలాది మంది విద్యార్థులు తెలంగాణ పోరాట బాట పట్టారు. వారి స్ఫూరితోనే తొలి దశ, మలి దశ ఉద్యమాలు సాగాయి. వివిధ కారణాల వల్ల ప్రత్యే రాష్ట్ర ఆకాంక్ష వాయిదా పడుతూ వచ్చినప్పుడు... చివరి రక్తపు బొట్టు వరకు, ఆఖరి శ్వాస వరకు, సమిధలైనా పర్వా లేదంటూ ఆనాడు యువత ఉద్యమానికి ముందుకొచ్చింది. శ్రీకాంతాచారి, కానిస్టేబుల్ కిష్టయ్య, యాదయ్య, ఇషాన్‌రెడ్డి... ఇలా ఎంతో మంది విద్యార్థులు ఉద్యమకారులు, ఆకాశంలో తారాజువ్వలై, రాష్ట్రం కోసం అమరులయ్యారు. అలాంటి సందర్భంలో సోనియాగాంధీ.. ఒక మాతృమూర్తిగా, రాజకీయ ఆలోచనలను పక్కనపెట్టి, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవ డానికి, ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి ఉదాత్తమైన నిర్ణయం తీసుకున్నారు. 2009 డిసెంబరు 9న తెలంగాణ ప్రక్రియ ప్రారంభమైందంటూ ప్రకటన ఇప్పించారు. ఆ తర్వాత అవాంతరాలు ఎదురైనా, పార్టీపరంగా ఎన్నో కోల్పోయినప్పటికీ.. తెలంగాణ రాష్ట్రాన్నిచ్చారు" అని రేవంత్ వివరించారు.

# ఆటో కార్మికుల సేవలు గొప్పవి

- టిఎడిఎస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం విజయవంతం
- ముఖ్య అతిథిగా హాజరైనా వాలా హరీష్ రావు



తొలిఅడుగు, మియాపూర్ : శేర్లింగంపల్లి నియోజకవర్గం నలగండ్ల కు చెందిన టి ఏ డి ఎస్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం పలువురు పోచమ్మ అమ్మవారి ఆశీస్సులతో నిర్వహించిన ఆటో యూనియన్ ఆత్మీయ సమ్మేళనంలో పలువురు ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ఆటో యూనియన్ నాయకుల ఆహ్వానం మేరకు ఆత్మీయ సమ్మేళనానికి బిఆర్ఎస్ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు వాలా హరీష్ రావు తో పాటు శేరిలింగంపల్లి ఆటో యూనియన్ ఇన్చార్జ్ తెలంగాణ ఉద్యమకారులు కంది దేవరాజ్, బాబు మోహన్, మల్లేష్ ఆత్మీయ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వాలా హరీష్ రావు మాట్లాడుతూ... సమాజంలో వినియోగదారులకు అహర్నిశలు నిస్వార్థంగా పనిచేస్తున్న ఆటో కార్మికుల సేవలను కొనియాడారు బిఆర్ఎస్ ప్రభుత్వ లో ఆటో కార్మికుల విషయంలో తీసుకున్న మంచి కార్యక్రమాల పట్ల ఆటో యూనియన్ నాయకులు కార్మికులు హర్షం వ్యక్తం చేశారని కానీ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆటో కార్మికుల విషయంలో ప్రభుత్వం ఏ విధమైనటువంటి సంక్షేమ పథకాలు కానీ కార్యక్రమాలు కానీ తీసుకోవటం లేదని ఈ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నల్లగండ్ల కు చెందిన టిఎడి ఎస్ ఆటో యూనియన్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, రమేష్, మల్లేష్, సురేష్, ప్రవీణ్, నరసింహ, విశ్వనాథం, జె . అశోక్ అంజి, ఆటో యూనియన్ నాయకులు సభ్యులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు.

# రెండు రోజుల్లో మోస్తరు వాన



హైదరాబాద్,తొలిఅడుగు,: రాష్ట్రంలో దక్షిన, నైరుతి దిశల నుంచి వీస్తున్న కిందిస్థాయి గాలుల ప్రభావంతో రాబోయే 2రోజులు గ్రేటర్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా, సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 29.4, కనిష్ఠం 21.5 డిగ్రీలు, గాలిలో తేమ 77 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

# సొంతిల్లు దుర్లభం



హైదరాబాద్,తొలిఅడుగు,: విలీన గ్రామాల్లో సొంతింటి కల మరింత ప్రియంకానున్నది. జీవితంలో ఒకసారే కట్టుకునేదే అయినా.. అనుమతుల కోసమే అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. గోటితో పోయేది గొడ్డలి దాకా వచ్చినట్టు.. గ్రామ పంచాయతీలో 2వేల రూపాయలతో వచ్చే ఇంటి అనుమతులకు ఇప్పుడు 5 నుంచి 10 రెట్లు పెరుగుతున్నది. ఇన్నాళ్లూ ఇంటి కోసం కల కన్న సామాన్యులు.. ఇప్పుడు అనుమతుల కోసం మున్సిపాలిటీ చుట్టూ తిరగలేక ఉన్న రేకుల షెడ్డుతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది.

మరింత భారం

వంద గజాల జాగలో రేకుల షెడ్డు, పెంకుటిల్లు కట్టుకుని దర్జాగా బతికేసే ఆ పల్లెవాసిపై బిల్డింగ్ అనుమతుల పేరిట భారీ మొత్తంలో భారం పడుతున్నది. మున్సిపాలిటీ పరిధిలో పెరుగనున్న మార్కెట్ వాల్యూతో కొత్తగా సొంతింటిని కొనుగోలు చేయాలనుకునే వారి లెక్కలు కూడా మారిపోతున్నాయి. ఇన్నాళ్లు వేసుకున్న బడ్జెట్ అంచనాలన్నీ తలకిందులు అవుతున్నాయి. హడావుడిగా తీసుకువచ్చిన విలీన ప్రక్రియతో భవన నిర్మాణ, రిజిస్ట్రేషన్ చార్జీలు భారీగా పెరగనున్నాయి. అధికారుల చుట్టూ తిరిగితేగానీ, అనుకున్న సమయానికి అనుమతులిచ్చే ఆన్‌లైన్ వ్యవస్థను ఇప్పటికే కాంగ్రెస్ సర్కార్ నిర్వీర్యం చేసింది. అనుమతులు దేవుడెరుగు పేదోడి జేబుకు చిల్లు పెట్టే బిల్డింగ్‌చార్జీల భారాన్ని ఎలా భరించాలనేది పంచాయతీలోని ప్రజలను కలవరపెడుతున్నది.

# సబ్ కాంట్రాక్టర్‌పై దాడి

- చేసిన పనికి డబ్బులు అడిగినందుకు
- అనుచరులతో కలిసి ఆర్కేపురం
- కార్పొరేటర్ భర్త దౌర్జన్యం బాధితుల ధర్నా..
- ధీరజ్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు
- బాధితుడిని పరామర్శించిన బీఆర్ఎస్
- రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



ఎల్బీనగర్, తొలిఅడుగు,: : చేసిన పనికి డబ్బులు ఇవ్వాలని కోరిన సబ్ కాంట్రాక్టర్‌పై ఆర్కేపురం కార్పొరేటర్ భర్త ధీరజ్‌రెడ్డి దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో ఆర్కేపురం కార్పొరేటర్ భర్త ధీరజ్‌రెడ్డి వద్ద పెద్దపల్లికి చెందిన దాసరి హనుమయ్య సబ్ కాంట్రాక్ట్ పనులు చేశాడు. అయితే బిల్లుల చెల్లింపు విషయంలో ఇరువురి మధ్య వివాదం నెలకొంది. ఈ క్రమంలో శనివారం రాత్రి డబ్బుల విషయం మాట్లాడేందుకు స్నేహితులు భాస్కర్, దాసరి కిషన్, కడెం, ఆముదాల నర్సయ్య, వల్లపు మంగితో కలిసి హనుమ య్య ఆర్కేపురంలోని ధీరజ్‌రెడ్డి కార్యాలయానికి వెళ్లాడు. తనకు కాంటాక్ట్ చేసిన పనులకు సంబంధించి రూ. 34లక్షలు రా వాలని కోరగా.. లేదు రూ. 16 లక్షలు మాత్రమే ఇ వ్వాల్సి ఉందని ధీరజ్‌రెడ్డి వాధించాడు. ఈ విషయంలో ఇరువురి మధ్య వివాదం నెలకొనడంతో ధీరజ్‌రెడ్డి.. తన అనుచరులతో కలిసి హనుమయ్యపై దాడికి పాల్పడటంతోపాటు హనుమయ్య వెంట వచ్చిన భాస్కర్ అనే వ్యక్తి ని కులం పేరుతో దూషించాడు. బాధితుడి కుమార్తె దాసరి ఉష ఆధ్వర్యంలో పలువురు పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా నిర్వహించి..వెంటనే ధీరజ్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని కోరారు. అనంతరం బాధితులు చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ధీరజ్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి.. అదుపులోకి తీసుకుని ఏసీపీ కార్యాలయానికి తరలించారు. అలాగే.. బీజేపీ నాయకులు కూడా హనుమయ్య, అతని అనుచరులు తమపై దాడిచేయడంతోపాటు ప్రవీణ్ అనే వ్యక్తిని కులంపేరుతో దూషించారని పోలీసులకు ఫిర్యాదు చేశా రు. ఈ మేరకు పోలీసులు ఇరువురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా.. దాసరి హనుమయ్యపై దాడి విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్.. ఎల్బీనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడిని పరామర్శించారు.

# 15 ఏండ్ల వాహనాలు స్వచ్ఛందంగా స్క్రాపింగ్ చేసుకుంటే..

హైదరాబాద్,తొలిఅడుగు,: : కాలం చెల్లిన వాహనాలపై ఆర్టీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 15 ఏండ్లు నిండిన వాహనాలను స్వచ్ఛందంగా స్క్రాపింగ్ చేసుకుంటే పలు రాయితీలు పొందవచ్చనని అధికారులు ఆర్టీఏ కార్యాలయాల్లో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే మహానగరంలో కాలం చెల్లిన వాహనాలు వేలాదిగా ఉన్నాయి. ఇవన్నీ రోడ్లపై చక్కర్లు కొడుతున్నాయి. అధికారులు తనిఖీల్లో కొన్ని పట్టుబడుతున్నా.. చాలా వరకు ముఖ్యంగా స్కూల్ బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలు గడువు ముగిసినా తిరుగుతున్నాయి. అధికారులు వీటిపై దృష్టి సారించి ప్రత్యేక తనిఖీలు సైతం చేస్తున్నారు. అందులో భాగంగా వాహనదారులకు స్క్రాపింగ్ ఉపయోగాలను వివరిస్తున్నారు. ట్రాన్స్‌పోర్ట్ వాహనాలైతే 20 ఏండ్ల లోపు స్క్రాప్ చేస్తే.. ప్రతి ఏటా పన్నుపై 10 శాతం రాయితీ వస్తుంది. సొంత వెహికల్ 15 ఏండ్లు నిండిన తర్వాత స్వచ్ఛందంగా స్క్రాపింగ్ వస్తే సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్ వస్తుంది. రెండేండ్లలోపు అదే విలువ గల వాహనం కొంటే ఎంవీ ట్యాక్స్‌లో మినహాయింపు ఉంటుంది. ఈ అంశాలపై అధికారులు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

## నిరుపేద వధువు వివాహానికి 5000 ఐదువేల రూపాయలు పంపిన కోలుముల దామోదర్ యాదవ్ కెనడా



తొలి అడుగు, పెద్దపల్లి, డిసెంబర్ 09 : పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల చామనపల్లి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన, సుందరగిరి అనిత శంకరయ్య దంపతుల కూతురు సరిత వివాహానికి ఆర్థిక సహాయం కావాలని చరవాణిద్వారా కోలుముల దామోదర్ యాదవ్ ఎన్ ఆర్ ఐ కెనడా కోలుముల దామోదర్ యాదవ్ ఫౌండేషన్ ఇంచార్జ్ తెలుపగా వెంటనే స్పందించి నేటి రోజున 5000 ఐదువేల రూపాయలను పంపగా ఆట్టి రూపాయలను వధువు వధువు తల్లిదండ్రులకు అందజేసిన దామోదర్ యాదవ్ ఫౌండేషన్ ఇంచార్జ్ వేల్పుల నాగరాజు.కార్యక్రమంలో పాల్గొన్న బందరి సత్తన్న, వేల్పుల శంకరయ్య, కల్వవుల ఎల్లయ్య,బందరి రాజయ్య,సుందరగిరి ఎల్లవ్వ,సుందరగిరి సర,బందరి దుర్గయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



తొలి అడుగు, చిన్నకోదూరు, డిసెంబర్ 09 : చిన్నకోదూరు మండల కేంద్రంలో మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న కోదూరు మండల కేంద్రంలో కేక్ కట్ చేసి సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. తదుపరి చిన్నకోదూరు ప్రభుత్వ హాస్పిటల్ లో పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ. 60 ఏళ్ల తెలంగాణ కళ నెరవేర్చిన తల్లి శ్రీమతి సోనియా గాంధీ అని కొనియాడారు. మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యతమిస్తున్న తల్లి సోనియా గాంధీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ కాంగ్రెస్ కమిటీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆంకర్ మధు, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం శ్రీనివాసరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి కనకరాజు, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి వాసరి మల్లేష్, వర్కర్స్ కాంగ్రెస్ కమిటీ మండల అధ్యక్షుడు మిట్టపల్లి మహేష్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బంక చిరంజీవి, ఫిషర్స్ మ్యాన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకట్,కాంగ్రెస్ నాయకులు కోనేటి కరుణాకర్, కట్కూరు బాబు, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## యువత రాజకీయాల్లోకి రావాలి- యువత కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తొడ్పాడాలి



తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 09 గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డిని స్టేట్ వైస్ ప్రెసిడెంట్ తూముకుంట ఆంక్షరెడ్డి,సిద్దిపేట జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొన్నాల రాజశేఖర్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి కొంగర అమరేందర్ రెడ్డి,జిల్లా యూత్ జనరల్ సెక్రటరీ అన్నబోయిన అనిల్ గౌడ్,దుబ్బాక నియోజకవర్గం ఉపాధ్యక్షుడు బురాని శ్రీకాంత్ కరాటే మాస్టర్,రాయపోల్ మండల యూత్ అధ్యక్షుడు దయాకర్ ముదిరాజ్,భూంపల్లి మండల అధ్యక్షుడులు లోకేష్, యువజన నాయకులు గుంటి నర్సింలు మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ పోటీలో గెలుపొందిన యువ నాయకులను సన్మానం చేసి అభినందించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ యూత్ నాయకులకు అన్ని విధాలుగా అండగా ఉంటానానీ అన్నారు.రానున్న స్థానిక ఎన్నికల్లో గ్రామాల్లో యువకులే కీలక పాత్రగా మిరే వహించి కాంగ్రెస్ పార్టీని బలోపేతంకు కృషి చేయాలన్నారు.దేశ రాజకీయలను మార్చేది యువతనే అని అన్నారు.రాజకీయాల్లోకి యువత రావాలని సూచించారు.

## ఘనంగా సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలు:



తొలి అడుగు, అమనగల్ డిసెంబర్ 9: సోనియా గాంధీ జన్మదిన వేడుకలను నియోజకవర్గ శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఉదయం:11:00 గంటలకు ఆమనగల్లు పట్టణంలోని మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల, కార్యకర్తల అభిమానుల సమక్షంలో సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా కేకు కట్ చేసి, చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేసి,జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నర్సింహ , మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి ,టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్ , అసెంబ్లీ అధ్యక్షులు దళపతి గౌడ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యట నర్సింహ , ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం,మండల అధ్యక్షులు జగన్ , టౌన్ అధ్యక్షులు వస్పుల మనయ్య, ధనుంజయ ఖాలీల్, అప్పం శ్రీను ఎంగలి ప్రసాద్ శీను విజయ్,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ కృష్ణ నాయక్ వెంకట్ రెడ్డి, పర్వతాలు, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఖాదర్ కరీం , ఫరీద్ విజేందర్ శ్రీశైలం, సభ్యులు,బ్లాక్ కాంగ్రెస్ సబ్యులు, కాంగ్రెస్ మండల సినియర్ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లు చెల్లించకుండా సర్పంచులపై మరింత భారాన్ని మోపుతున్న రేవంత్ రెడ్డి!

- సీఎం రేవంత్ రెడ్డి పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలి!
- కాముని శ్రీనివాస్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు
- ములకల కనకరాజు సొసైటీ చైర్మన్



తొలి అడుగు, చిన్నకోదూర్, డిసెంబర్ 09 : మాజీ సర్పంచుల అక్రమ అరెస్టులను మరియు బీఆర్ఎస్ ఎంఎల్ఏ లను అసెంబ్లీలోకి రానివ్వకుండ అడ్డుకోవడం అప్రజాస్వామికమని కండిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, పిఏసిఎసి చేర్మెన్ ములకల కనకరాజు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం నాడు మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు నాయకులు మాట్లాడుతు దిన దినము నిర్బంధాలు పెరిగిపోతున్నాయి తప్పితే ప్రజా సమస్యలు పరిష్కరించడానికి రేవంత్ రెడ్డి ముగ్గు చూపడం లేదని వారు అన్నారు పల్లెలే పట్టుకొమ్మలుగా పల్లెలు బాగుంటే దేశం బాగుంటుందని సొంతగా డబ్బులు ఖర్చులు పెడుతూ పల్లెలను అభివృద్ధి చేస్తే ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన రేవంత్ రెడ్డి మాట ఉస్తు త్వరలోనే మాజీ సర్పంచ్ల పెండింగ్ బిల్లులను విడుదల చేస్తామని చెప్పి సంవత్సర కాలంగా జాప్యం చేస్తున్నాడని తద్వారా మాజీ సర్పంచుల అప్పులు మిత్తిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని గతంలో అయితే కొంతమంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఇకముందు అలా జరగకుండా ఉండాలంటే పెండింగ్ బిల్లులను తక్షణమే రిలీజ్ చేసి ఆదుకోవాలని అదేవిధంగా నేడు అసెంబ్లీ సమావేశాలు ఉండగా ఆ సమావేశాలకు ప్రజల చేత ఎన్నుకోబడ్డ ఎమ్మెల్యేలను ముఖ్యంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ లోపలికి రాకుండా అడ్డుకొని గేట్లు పెట్టుకోవడం అప్రజా స్వామికమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియంత పోకడ అని వారు దుయ్యబట్టారు తెలంగాణ రైతుల చేత ప్రజల చేత రేవంత్ రెడ్డికి నిరసన వ్యక్తమౌతున్న రేవంత్ రెడ్డికి చీమకుట్టినట్టుగా కూడ లేదని వారు అన్నారు ఇకనైనా ప్రజాపాలన పైన దృష్టి పెడితే బాగుంటుందని లేకుంటే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని వారు అన్నారు ఈ కార్యక్రమంలో కాముని శ్రీనివాస్, ములకల కనకరాజు, జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కాముని ఉమేష్ చంద్ర, ఇట్టమేన శ్రీనివాస్, కొండం రవీందర్ రెడ్డి, పడిగె లింగం, మన్నే ఆనంద్, సుంచు రమేష్, కామ శ్రీనివాస్, సబ్బెన కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

## అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం



తొలి అడుగు, నంగునూరు, డిసెంబర్ 09 : ఈరోజు రాజగోపాల్ పేట పోలీస్ స్టేషన్ లో ముందస్తుగా తాజా మాజీ సర్పంచ్లను అరెస్టు చేసి స్టేషన్కు తరలించిన పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులందరూ పెండింగ్ బిల్లు చెల్లించాలని ఈరోజు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ఉంది. వెళ్లకుండా పోలీసులు అరెస్టు చేయడం జరిగింది.రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్ల పెండింగ్ బిల్లు వెంటనే చెల్లించాలని సర్పంచులందరూ పక్షాన డిమాండ్ చేస్తా ఉన్నాము.పోలీసు అరెస్టు చేసిన సర్పంచుల వివరాలు అక్కెనపల్లి సర్పంచ్ వెంకటేష్ ,జెపి తండా సర్పంచ్ బిక్షపతి నాయక్, రాజగోపాల్పేట సర్పంచ్ ఏ ల రాజేంద్ర ,పాలమకుల సర్పంచ్ పంగ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు.



తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 09 : 4 కోట్ల తెలంగాణ ప్రజల ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన తెలంగాణ తల్లి, ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా దుబ్బాక నియోజకవర్గంలోని రాయపోల్ మండలం కేంద్ర పరిధిలో జన్మదిన వేడుకలు మరియు పండ్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి

ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది తెలంగాణ అమరవీరుల త్యాగాలను గుర్తించి,ఎలాంటి రాజకీయ లాభాపేక్ష లేకుండా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ఆనాటి యుపిఎ ప్రభుత్వ చైర్ పర్సన్ శ్రీమతి సోనియా గాంధి కి తెలంగాణ ప్రజల తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాయపోల్ మండల అధ్యక్షులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మరియు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కార్యకర్తలు సీనియర్ నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దొరల తెలంగాణను ప్రజల తెలంగాణగా మార్చుకుందాం

**– సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్ కుమార్**



తొలి అడుగు, నంగునూర్, డిసెంబర్ 09 : కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను నంగునూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సిద్దిపేట యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ పవన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేస్తూ తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన ప్రదాత సోనియాగాంధీ అంటూ, జై కాంగ్రెస్ జై సోనియమ్మ అని నినాదాలు చేశారు. అలాగే నూతనంగా సిద్దిపేట యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ గెలుపొందిన సాదుల పవన్ కుమార్ ను సీనియర్ నాయకులు ఎండీ ఇమ్రాన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎండీ ఇమ్రాన్ మాట్లాడుతూ .. సోనియమ్మ తెలంగాణ ప్రజల 60 ఏళ్ల ఆకాంక్షను నెరవేర్చిందని కొనియాడారు. తన నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోంతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంపై సోనియా గాంధీకి ఉన్న ప్రేమ ప్రత్యేకమైనదని ప్రత్యేక రాష్ట్రం కోసం 1969 నుంచి జరిగినా అనేక ఉద్యమాలు బలిదానాలను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రజల చిరకాల వాంఛ అయినా ప్రత్యేక రాష్ట్ర కలను సహకారం చేస్తామని 2004లో కరీంనగర్ వేదికగా సోనియాగాంధీ హామీ ఇచ్చారని గుర్తుకు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం 2009 డిసెంబర్ 9న హోం మంత్రి చిదంబరం ద్వారా తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రకటించారని, తెలంగాణ ప్రజల కలను నెరవేర్చడమే కాకుండా 2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సోనియా గాంధీ తినలేని కృషి చేసిందని కొనియాడారు. తెలంగాణ ప్రజలకు సోనియా గాంధీ తల్లితో సమానమని ఉద్ఘటించారు. ఈ కార్యక్రమంలో బోజు రాములు, తోట హరీష్, సిర్రం సోమయ్య, బడే అశోక్, బడే నవీన్, అనరాజు సత్తవ్వ, బొజ్జ గోపి, నరేష్, సందీప్, శేఖర్, ప్రశాంత్, శ్రీధర్,శివ తదితరులు పాల్గొన్నారు.

# నిజమైన స్నేహితులు వారి స్నేహితులను మత్తుపదార్థాలకు బానిస కానివ్వరు

**– సిద్దిపేటలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సెమినార్**




తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 09 : భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ యు స్ ఎఫ్ ఐ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిద్దిపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా సెమినార్ నిర్వహించడం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా టి పి టి ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కనకయ్య, సీనియర్ అడ్వకేట్ భూపతి , పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ , యు ఎస్ ఎఫ్ ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రవి,సిద్దిపేట జిల్లా కార్యదర్శి చంద్లాపురం మధు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే గొప్ప గొప్ప వారిగా కావడానికి మనం ఎంచుకునే దారే ఉపయోగపడుతుంది. కాబట్టి ఈ దశలోనే మీరు అనారోగ్యానికి గురికాకుండా సమాజంలో ఒక గొప్ప వ్యక్తిగా కావడానికి కృషి చేయండి. మత్తు పదార్థాల అలవాట్లు ఉన్న మీ స్నేహితులను వాటికి దూరం చేయడానికి స్నేహితులుగా మీరు నిర్వహించే పాత్ర చాలా ముఖ్యమైనది. మీరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మీ మిత్రులను కూడా వాటి నుంచి దూరంగా ఉండేలా చర్యలు తీసుకోండి. విద్యార్థి దశలో చదువుకు దగ్గరగా, చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. మీరు చదువుకొని బాగుపడితేనే మీరు, మీ కుటుంబం, ఈ సమాజం బాగుపడుతుంది. నిజమైన స్నేహితులు ఎల్లప్పుడూ వారి మిత్రులను కూడా మత్తుపదార్థాలకు బానిస కాకుండా చూసుకుంటారు. సినిమాల ప్రభావం, సోషల్ మీడియా ప్రభావం విద్యార్థుల మీద పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. చదవకుండా తప్పుడు మార్గాలలో పయనిస్తున్న విద్యార్థులను దండించడం కూడా వారిని క్రమశిక్షణలో పెట్టడంలో భాగమే అని అందరూ గుర్తుంచుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు యుఎస్ఎఫ్ఐ నాయకులు ప్రకాష్, వినయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం

**– రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్, చైర్మన్ కొత్వాల**



తొలిఅడుగు, పాల్వంచ, డిసెంబర్ 09 : గతంలోని ప్రభుత్వం హయాంలో 10 సంవత్సరాలుగా పరిష్కారంగాని అనేక ఉపాధ్యాయుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఒక సంవత్సర కాలంలోనే అనేక సమస్యలకు పరిష్కారం లభించిందని రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్, చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. కొత్తగూడెం పట్టణంలోని కొత్తగూడెం క్లబ్ లో తెలంగాణా రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 5 వ మహాసభను నిర్వహించారు. ఈ మహాసభల్లో గౌరవ అతిధిగా పాల్గొన్న కొత్వాల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు, కొత్త టీచర్ల నియామకం వెంటి చర్యలు చేపట్టిందన్నారు. అపరిష్కృతంగా వున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, పారుపల్లి నాగేశ్వరరావు, పద్మలత, రాజు, కిషోర్ సింగ్, నంది కృష్ణ, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, కందుకూరి రాము, డిష్ నాగేశ్వరరావు, కాపా శ్రీను, తంగెళ్ళ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# యునైటెడ్ స్టేట్స్ న్యూ యార్క్ బయలుదేరిన టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి





తొలి అడుగు, ఆమనగల్ డిసెంబర్ 9: యునైటెడ్ స్టేట్స్ న్యూ యార్క్ నగరంలో జరుగుతున్న....8వ యాక్టివ్ ఇంపాక్ట్ సమ్మిట్ లో తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న ఐదుగురు తెలంగాణ యువ ఆవిష్కర్తలతో బయలుదేరిన టాస్క్ సి.ఓ. ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ డిపార్ట్మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ సహకారంతో గ్రీన్ స్కిల్స్ అకాడమీని ప్రారంభించింది. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్, టి-హబ్ మరియు టి-వర్క్స్ ద్వారా రాష్ట్రంలోని కళాశాల యువతలో గ్రీన్ స్కిల్స్‌ను వేగవంతం చేయడం ఈ చొరవ లక్ష్యం అని తెలిపారు తమ పిల్లల్లో సామర్థత ను గుర్తించి గ్లోబల్ స్టేజ్ వరకు తీసుకెళ్లేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దూరదృష్టి, ఐటి మంత్రి శ్రీధర్ బాబు గారి నిబద్ధత పట్ల యువ ఆవిష్కర్తల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ కు సన్మానం



తొలి అడుగు, ఆమనగల్ డిసెంబర్ 9: ఆమనగల్ పట్టణానికి చెందిన వసుప్పుల శ్రీకాంత్ అమంగల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా నియమితులైన సందర్భంగా ఏఎంసి చైర్మన్ యాట గీత నరసింహ మరియు పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్ మాజీ జడ్పీటిసి సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి సన్మానం చేసినారు సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీకి మంచి పేరు తీసుకురావాలని అందరితో కలిసిమెలిసి పార్టీని ముందుకు నడిపించాలని వారు శ్రీకాంత్ కు చెప్పినారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జగన్ ధనుంజయ మైసయ్య మానేయ్య లక్ష్మణ్ నాయక్ కండేసాయి హలీం నాజర్ వాటర్ బాబా విజయ్ కుమార్ రాములు షర్ఫుద్దీన్ మహేష్ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డుల్లో రైతుల వడ్లను పరిశీలించిన చైర్మన్ యాట గీతా నరసింహ

తొలి అడుగు, అమనగల్ డిసెంబర్ 9: రంగారెడ్డి జిల్లా అమంగల్ మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు తెచ్చినటువంటి వడ్ల తెమ శాతం పరిశీలించి రైతులకు మార్కెట్ యాల్లో ఎలాంటి అక్రమాలు జరగవద్దని వారు తెచ్చినటువంటి వడ్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినటువంటి ధరను ఇవ్వాలని రైతులకు మార్కెట్ యార్డ్ లో అన్ని వసతులు కల్పించాలని అధికారులతో చెప్పినారు ఈ కార్యక్రమంలో ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ సిబ్బంది మరియు వ్యాపారులు రైతులు పాల్గొన్నారు.



# పరవాడ మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు తో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే పంచకర్ల

తొలి అడుగు పరవాడ డిసెంబర్ 9 : పరవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అధ్యక్షతన మండలం లో గల అన్ని శాఖల అధికారులు తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు వారు అన్ని శాఖల అధికారులకు తగు సూచనలు సలహాలు ఇచ్చినారు అన్ని శాఖల అధికారులకు మీ మీ శాఖలలో ఉన్న పెండింగ్ సమస్యలపై నాకు రాత పూర్వకంగా ఇచ్చినట్లయితే నేను పై అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి పైల జగన్నాథ రావు గారు, కర్నూలు వెంకటరమణ, మోటూరు సన్యాసినాయుడు, సిరపురపు అప్పలనాయుడు, బొద్దపు శ్రీనివాస్,చింతకాయల ముత్యాలు, బుగిడి రామ గోవిందరావు,నాగిరెడ్డి చిన్నారావు, అర్జిల్లి రవి, బండారు రాజశేఖర్, గొన్న రమాదేవి, వడ్రీ పరదేశి నాయుడు, సాలాపు శివ, పైల దినేష్, పావని,మరియు ఉమ్మడి ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.



# బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



తొలి అడుగు పరవాడ డిసెంబర్ 8 : పరవాడ మండల పరిధిలో అనధికారంగా మద్యం అమ్మకాలు, బెల్ట్ షాపులు నిర్వహించినా, బెల్ట్ షాపులను ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పరవాడ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. ఈ మేరకు పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని వైన్ షాపుల యజమానులకు ఫార్వర్డ్ పోలీస్ స్టేషన్ లో శనివారం నాడు మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్లో మద్యం దుకాణాలను వేలం నిర్వహించడం లాంటి పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, బెల్ట్ షాపులు నిర్వహించకూడదని, సీసీ కెమెరాలు తప్పనిసరిగా పెట్టాలని వారికి తెలియపరిచారు. ప్రభుత్వం యొక్క నిబంధనలు షాపులు నిర్వహణలో విధిగా పాటించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై నిఘా ఉంచామని దాడులు కూడా కొనసాగిస్తున్నామని తెలిపారు

# జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు



తొలి అడుగు పరవాడ డిసెంబర్ 8 : గత నెల 19,20,21తేదిలలో స్కూల్ గేమ్స్ వారి ఆధ్వర్యంలో మచిలీపట్నం లో జరిగిన బాక్సింగ్ పోటీలలో బంగారు పతకాలు సాధించిన సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు జి. గౌతమ్, జి.హర్షిత ఎ.హర్షిత లు రేపటి నుండి ఢిల్లీ లో జరుగు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొను చున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి తెలిపారు. ఈ క్రీడాకారులను మరియు కోచ్ అమర్నాథ్, అన్నపూర్ణ లని సంస్కృతి గ్లోబల్ స్కూల్ సీ.ఈ.ఓ కె. నిశాంత్ అభినందనలు తెలుపుతూ జాతీయ స్థాయి పోటీలలో రాణించలని తెలిపారు.

# రోజూ 10 లక్షల స్పామర్స్ గుర్తించిన ఎయిర్‌టెల్ ఏఐ నెట్‌వర్క్




న్యూఢిల్లీ, తొలిఅడుగు : తమ కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత స్పామ్ ఫిల్టర్.. రోజూ 10 లక్షల స్పామర్స్‌ను గుర్తించినట్టు సోమవారం భారతీ ఎయిర్‌టెల్ ప్రకటించింది. ఇక గత రెండున్నర నెలల్లో 800 కోట్ల స్పామ్ కాల్స్‌ను, 80 కోట్ల ఎస్ఎంఎస్‌లను కూడా గుర్తించినట్టు ఈ దేశీయ ప్రైవేట్ రంగ టెలికం సంస్థ ఓ ప్రకటనలో పేర్కొన్నది. దీంతో ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌పై వచ్చిన కాల్స్‌లో 6 శాతం, ఎస్ఎంఎస్‌ల్లో 2 శాతం స్పామర్లు చేసినవేనని తేలింది. స్పామ్ కాల్స్ చేసింది, అందుకున్నది రెండింటిలోనూ ఢిల్లీ అగ్రస్థానంలో ఉన్నట్టు సంస్థ వెల్లడించింది. ఢిల్లీ తర్వాత ఏపీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ యూజర్లు స్పామ్ కాల్స్‌ను అధికంగా అందుకున్నారు. ఢిల్లీ తర్వాత ముంబై, కర్నాటకల నుంచి స్పామ్ కాల్స్ ఎక్కువగా వెళ్లాయి. అలాగే ల్యాండ్‌లైన్ ఫోన్ల నుంచే స్పామ్ కాల్స్ అధికంగా వస్తున్నట్టు కనిపెట్టారు. ఎస్ఎంఎస్‌ల విషయానికొస్తే.. గుజరాత్, కోల్‌కతా, యూపీల నుంచి ఎక్కువగా వచ్చాయి. ముంబై, చెన్నై, గుజరాత్ వాసులే లక్ష్యంగా ఇవి వెళ్లాయి. పురుష వినియోగదారులే లక్ష్యంగా 76 శాతం స్పామ్ కాల్స్ వచ్చాయి. ఈ ఏఐ పవర్డ్ సొల్యూషన్‌ను రెండున్నర నెలల క్రితమే ఎయిర్‌టెల్ అందుబాటులోకి తెచ్చింది. కాగా, దీంతో భారతీయ తొలి స్పామ్ ఫైటింగ్ నెట్‌వర్క్‌గా భారతీ ఎయిర్‌టెల్ నిలిచింది. మొబైల్ వినియోగదారులను విసిగిస్తున్న ఈ అవాంఛిత కాల్స్, సందేశాలకు అడ్డుకట్ట వేయాలని టెలికం సంస్థలను టెలికం రంగ రెగ్యులేటర్ ట్రాయ్ ఆదేశించినది తెలిసిందే.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక


# బాలీవుడ్‌లో పుష్పరాజ్ ఊచకోత.. నార్త్‌లో ఆల్ టైమ్ రికార్డ్!

తొలిఅడుగు, సినిమా : ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన క్రేజీ సీక్వెల్ పుష్ప 2 ది రూల్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తుంది. ఈ సినిమా మొదటిరోజే హిందీలో షారుఖ్ ఖాన్ జవాన్ పేరిటా ఉన్న రికార్డును బద్దలుకొట్టిన విషయం తెలిసిందే. హిందీలో జవాన్ సినిమా ఫస్ట్ డే రూ.65 కోట్ల కలెక్షన్స్ రాబట్టగా.. ఫస్ట్ రోజు ఆ రికార్డును అధిగమించాడు అల్లు అర్జున్. మొదటి రోజు రూ.72 కోట్ల కలెక్షన్లు రాబట్టిన ఈ చిత్రం రెండో రోజు రూ.59 కోట్లు రాబట్టింది. ఇక మూడో రోజు అయితే ఏకంగా రూ.74 కోట్ల వసూళ్లను రాబట్టింది. దీంతో మొదటి రోజున సాధించిన రూ.72 కోట్ల కలెక్షన్లు అధిగమించి తన రికార్డును తానే తిరగరాశాడు అల్లు అర్జున్. అయితే ఆదివారం కూడా ఈ రికార్డులు బద్దలయ్యింది. ఆదివారం రోజున ఏకంగా రూ.86 కోట్ల వసూళ్లతో ప్రభంజనం సృష్టించాడు పుష్పరాజ్. దీంతో నాలుగు రోజుల్లోనే బాలీవుడ్‌లో రూ.294 కోట్ల వసూళ్లను రాబట్టి చరిత్ర సృష్టించాడు.




# క్రేజీ వార్త చెప్పిన రణ్‌బీర్‌కపూర్.. అప్పుడే యానిమల్ 3పై క్లారిటీ..!

తొలిఅడుగు, సినిమా : తక్కువ టైంలోనే ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో డైరెక్టర్‌గా సూపర్ క్రేజ్‌తోపాటు కోట్లాదిమంది ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న టాలీవుడ్ దర్శకుల్లో టాప్‌లో ఉంటాడు సందీప్ రెడ్డి వంగా . అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్ సినిమాలతో బాక్సాఫీస్ రికార్డ్ బద్దలు కొట్టిన సందీప్ రెడ్డి వంగా బీటౌన్ యాక్టర్ రణ్‌బీర్ కపూర్ తో యానిమల్ సీక్వెల్ యానిమల్ పార్క్ కూడా చేయబోతున్నాడని తెలిసిందే. ఈ ఫ్రాంఛైజీలో మూడో పార్టు కూడా ఉండబోతుందన్న వార్త ఇప్పుడు నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. సీక్వెల్ 2027లో మొదలవుతుందని చెప్పిన రణ్ బీర్ కపూర్ .. ఆ తర్వాత యానిమల్ 3కు సంబంధించి ప్రొడక్షన్ పనులు త్వరగా ప్రారంభించడంపై ఫోకస్ పెడతానని చెప్పాడు. థర్డ్ పార్ట్ చేయాలనే ఆలోచన మొదటి నుండే ఉందని.. యానిమల్ విజయం సాధించడంతో అది ధృడమైన నిర్ణయంగా మారిందని చెప్పుకొచ్చాడు రణ్‌బీర్‌కపూర్. సందీప్ రెడ్డి వంగాను ఒరిజినల్ డైరెక్టర్‌గా సంబోధించే రణ్‌బీర్.. ఈ క్రేజీ డైరెక్టర్‌తో ఫ్రాంఛైజీ సినిమాలు చేయడంపై ఎక్జయిటింగ్‌గా ఉన్నాడు.



# శివ కార్తికేయన్‌కు జోడీగా..



తొలిఅడుగు, సినిమా : 'అమరన్'తో హిట్టు కొట్టి మంచి ఫామ్‌లో ఉన్నారు తమిళ కథానాయకుడు శివ కార్తికేయన్ . ఇప్పుడాయన తన 24వ సినిమా చేయబోతున్నారు. శిబి చక్రవర్తితో కలిసి ఈ సినిమా ప్రారంభించనున్నారు. 'డాన్' విజయం తర్వాత వీళ్లిద్దరి కాంబోలో రూపొందనున్న రెండో చిత్రమిది. ప్యాషన్ స్టూడియోస్ సంస్థ నిర్మించనుంది. 'పుష్ప 2' విజయంతో పాన్ ఇండియాలో అదరగొట్టేస్తున్న రష్మికను ఇందులో నాయికగా రంగంలోకి దించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ చిత్ర విషయమై ఆమెతో సంప్రదింపులు జరిగాయని.. స్క్రిప్ట్ నచ్చడంతో తను కూడా సానుకూలంగా స్పందించిందని తెలిసింది. ఈ ప్రాజెక్ట్ వచ్చే నెల తొలి వారంలో మొదలయ్యే అవకాశముంది. అనిరుధ్ సంగీతం అందిస్తున్న చిత్రమిది. శివ కార్తికేయన్ ప్రస్తుతం మురుగదాస్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ చివరి దశలో ఉంది.'పుష్ప' సక్సెస్‌ను ఆస్వాదిస్తున్న నేషనల్ క్రష్ రష్మిక ప్రస్తుతం తెలుగులో 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమితో బిజీగా ఉంది. దానితోపాటు కుబేర, ఛావా, సికందర్, రెయిన్‌బో చిత్రాల్లో నటిస్తోంది.

# ఆ పోలిక ఎందుకో.. సమంత వైరల్ పోస్ట్

తొలిఅడుగు, సినిమా : సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు సమంత. తనకు సంబంధించిన అన్ని విషయాలను ఇన్‌స్టా వేదికగా షేర్ చేస్తుంటారు. ప్రేమను ఉద్దేశించి తాజాగా ఆమె పెట్టిన పోస్టు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. తన పెంపుడు శునకం సాషాతో దిగిన ఓ ఫొటోని షేర్ చేశారు. "సాషా ప్రేమ మాదిరిగా మరొక ప్రేమ లేదు" అని క్యాప్షన్ జత చేశారు. ప్రస్తుతం ఇది నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇటీవల సిటాడెల్ సిరీస్ ఆకట్టుకున్న సామ్ తన సొంత బ్యానర్ ట్రాలాలా ఎంటర్‌టైన్‌మెంట్‌లో మా ఇంటి బంగారం' చిత్రం ప్రకటించారు. కానీ ఈ సినిమాకు సంబంధించి ఇంకా ఏ అప్‌డేట్ రాలేదు. ప్రస్తుతం ఆమె రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్ సిరీస్ చేస్తున్నారు. నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్న ఈ సిరీస్‌లో అలీ ఫాజిల్, ఆదిత్యారాయ్ కపూర్‌బీ వామికా గబ్బి నటిస్తున్నారు. రాజ్ అండ్ డీకే సారథ్యంలో రాహి అనిల్ బర్వే దర్శకత్వం వహిస్తున్నారు.



# విక్రమ్ గ్యాంగ్ వర్సెస్ పోలీసులు.. వీర ధీర సూరన్ టీజర్



తొలిఅడుగు, సినిమా :: కోలీవుడ్ స్టార్ యాక్టర్ చియాన్ విక్రమ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రాల్లో ఒకటి వీరధీరసూరన్ . ఛియాన్ 62గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి చిత్త (చిన్నా) ఫేం ఎస్‌యూ అరుణ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా నుంచి ఇప్పటికే టైటిల్ టీజర్ లాంచ్ చేశారని తెలిసిందే. తాజాగా టీజర్ విడుదల చేశారు. విక్రమ్ గ్యాంగ్‌కు, పోలీసులకు మధ్య జరిగే పోరు నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు టీజర్ చెప్పకనే చెబుతోంది. విక్రమ్‌ను చాలా రోజుల తర్వాత నయా అవతార్‌లో చూపించబోతున్నట్టు టీజర్‌తో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. ఈ సారి విక్రమ్ పక్కా యాక్షన్ ప్యాక్‌డ్ కమర్షియల్ సినిమాతో రాబోతున్నాడని టీజర్ చెప్పకనే చెబుతోంది. ఈ మూవీలో కోలీవుడ్ భామ దుషారా విజయన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని 2025 పొంగళ్ కానుకగా జనవరిలో రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించారు. ఈ చిత్రంలో పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ ఎస్‌జే సూర్య, పాపులర్ మలయాళ నటుడు సూరజ్ వెంజరమూడు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీ రెండు పార్టులుగా రాబోతుంది.

# శ్రీనిధికి రెండో ఓటమి



హైదరాబాద్, తొలిఅడుగు,: ప్రతిష్టాత్మక ఐ–లీగ్ 2024–25 సీజన్‌లో రెండు విజయాల తర్వాత శ్రీనిధి డెక్కన్‌కు రెండో ఓటమి ఎదురైంది. డెక్కన్ ఎరీనా వేదికగా ఢిల్లీ ఎఫ్‌సీతో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి.. 0–1తో పరాభవం పాలైంది. మ్యాచ్‌లో ఢిల్లీ తరఫున స్టీఫెన్ సమీర్ 71వ నిమిషంలో ఏకైక గోల్ చేశాడు. ఈ టోర్నీలో డిసెంబర్ 13న శ్రీనిధి.. డెంపో ఎఫ్‌సీతో తలపడనుంది.

# భారత్ జోరు



తొలిఅడుగు, ఓమన్: మహిళల జూనియర్ ఆసియా కప్‌లో భారత్ జోరు కొనసాగుతోంది. తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను చిత్తుచిత్తుగా ఓడించిన మన అమ్మాయిలు.. రెండో మ్యాచ్‌లో 5–0తో మలేషియాకు ఓటమి రుచి చూపించారు. పూల్–ఏలో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో తొలి అర్థభాగంలో ఒక్క గోల్ కూడా చేయలేకపోయిన భారత్.. సెకండాఫ్‌లో పుంజుకుంది. స్టార్ స్ట్రైకర్ దీపిక కుమారి హ్యాట్రిక్ గోల్స్ చేయగా కనిక, వైష్ణవి తలా ఓ గోల్ చేశారు.

# హైదరాబాదీ బౌలర్‌కు షాక్ ఇచ్చిన ఐసీసీ..
## మ్యాచ్ ఫీజులో 20శాతం కోత.. హెడ్‌కు మందలింపు..!

తొలిఅడుగు డెస్క్: టీమిండియా బౌలర్ మహ్మద్ సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి షాక్ ఇచ్చింది. కీలక చర్యలు తీసుకున్నది. అడిలైడ్ వేదికగా జరిగిన టెస్టులో మైదానంలోనే ఆసిస్ బ్యాటర్‌తో గొడవ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ఐసీసీ సిరాజ్‌కు జరిమానా విధించగా.. హెడ్‌ను మందలించింది. సిరాజ్‌కు మ్యాచ్ ఫీజులో 20శాతం కోత విధించింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు సిరాజ్, ట్రావిస్ హెడ్ ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్‌ను చేర్చింది. అడిలైడ్ టెస్ట్‌లో ట్రావిస్ హెడ్ అవుట్ అయ్యాక సిరాజ్ దూకుడుగా వ్యవహరించాడని.. ఇద్దరి మధ్య కొద్ది సెకన్ల పాటు వాగ్వాదం జరిగింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని సెక్షన్ 2.5ని ఉల్లంఘించినందుకు సిరాజ్‌కు మ్యాచ్ ఫీజులో 20శాతం కోత విధించినట్లు ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. సెక్షన్ 2.13 ఉల్లంఘినందుకు ట్రావిస్ హెడ్‌ను మందలించింది. అయితే, బోర్డర్ గవాస్కర్ సిరీస్‌లో భాగంగా అడిలైడ్ వేదికగా రెండో టెస్ట్ మ్యాచ్ జరిగింది. 310 పరుగుల స్కోరు వద్ద సిరాజ్ వేసిన యార్క్‌కు ట్రావిస్ హెడ్ బౌల్డ్



అయ్యాడు. 141 బంతుల్లో 140 పరుగులు చేసిన హెడ్‌ను బౌల్డ్ చేశాక సిరాజ్ దూకుడుగా వ్యవహరించారు. అయితే, హెడ్ సైతం పెవిలియన్‌కి వెళ్లే సమయంలో సిరాజ్‌ను ఏదో అన్నాడు. దానికి సిరాజ్ స్పందిస్తూ మొదట ఇక్కడి నుంచి వెళ్లు అన్నట్లుగా చెప్పడంతో వాతావరణం వేడెక్కింది. అయితే, తాను బాగా బౌలింగ్ చేశావని సిరాజ్‌ను మెచ్చుకున్నానని.. దాన్ని తప్పుగా అర్థం చేసుకున్నాడని హెడ్ మ్యాచ్ అనంతరం తెలిపాడు. అయితే, దాన్ని సిరాజ్ ఖండించారు. హెడ్ చెప్పినవన్నీ అబద్ధాలేనని కొట్టిపడేశాడు. ఈ గొడవపై ఇద్దరు కెప్టెన్లు సైతం స్పందించేందుకు ఇష్టపడలేదు. గొడవ గురించి హెడ్ చూసుకుంటాడని.. అతను పిల్లాడు కాదని ఆసిస్ కెప్టెన్ కమిన్స్ పేర్కొనగా.. దూకుడుగా ఉండడం తప్పులేదని.. సిరాజ్‌కు మద్దతు ఇస్తున్నట్లు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ స్పష్టం చేశాడు.

# పుంజుకున్న లిరెన్



తొలిఅడుగు,సింగపూర్: ముగింపు దశకు చేరుకున్న కొద్దీ ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో పోరు రసవత్తరంగా సాగుతోంది. టోర్నీలో తొలి మ్యాచ్ గెలిచిన డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్.. 11 రౌండ్ల తర్వాత రెండో విజయాన్ని నమోదుచేశాడు. సోమవారం జరిగిన 12వ రౌండ్‌లో లిరెన్.. గుకేశ్‌పై 39 ఎత్తుల్లో విజయం సాధించాడు. ఈ టోర్నీలో వరుసగా ఏడు గేమ్‌లు డ్రాగా ముగియగా 11వ గేమ్‌లో గుకేశ్ ఎట్టకేలకు గెలిచి ఆధిక్యంలోకి వచ్చాడు. కానీ సోమవారం లిరెన్ పుంజుకోవడంతో పాయింట్లు సమమయ్యాయి. కాగా 12 రౌండ్లు ముగిసేసరికి ఈ టోర్నీలో ఇరువురూ తలా 6 పాయింట్ల (మొదటగా 7.5 పాయింట్లు సాధించినవారు విజేత)తో సమానంగా ఉన్నారు. మరో రెండు మ్యాచ్‌లు మాత్రమే మిగిలున్న మోగా టోర్నీలో గుకేశ్, లిరెన్ తలా ఓ మ్యాచ్ నెగ్గినా లేక రెండు గేమ్‌లు డ్రా అయినా విజేతను నిర్ణయించేందుకు టై బ్రేకర్ అవసరం అయ్యే అవకాశముంది. అలా కాకుండా ఇరువురిలో ఒక్కరు వరుసగా రెండు గేమ్‌లను సొంతం చేసుకుంటే వారే ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ కిరీటాన్ని దక్కించుకుంటారు. మంగళవారం సెలవు దినం కాగా బుధ, గురువారాలలో మిగిలిన రెండు రౌండ్స్ జరుగనున్న ఈ టోర్నీలో ఇకనుంచి హోరాహోరి పోరు జరగడం ఖాయం.

# సిరీస్ గెలిచి.. అగ్ర భాగాన నిలిచి..

తొలిఅడుగు, గబేహా: స్వదేశంలో శ్రీలంకతో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను దక్షిణాఫ్రికా 2–0తో గెలుచుకుంది. 348 పరుగుల భారీ ఛేదనలో భాగంగా ఆట చివరిరోజు ఓవర్ నైట్ స్కోరు 205/5తో బ్యాటింగ్‌కు వచ్చిన లంకేయులు.. మరో 33 పరుగులు మాత్రమే జోడించి 238కు ఆలౌట్ అయ్యారు. సఫారీ స్పిన్నర్ కేశవ్ మహారాజ్ (5/76) లంక పనిపట్టాడు. కెప్టెన్ ధనంజయ డిసిల్వ (50) కుశాల్ మెండిస్ (46) ఔట్ అవడంతో సఫారీల విజయం ఖాయమైంది. డేన్ పీటర్సన్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సౌతాఫ్రికా సారథి టెంబ బవుమాకు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు దక్కింది. ఇక ఈ విజయంతో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో సౌతాఫ్రికా అగ్రస్థానానికి చేరుకుంది. 63.33 శాతంతో దక్షిణాఫ్రికా తొలి స్థానాన్ని దక్కించుకోగా 60.71తో ఆస్ట్రేలియా రెండో స్థానాన నిలిచింది. 57.29 శాతంతో భారత్ మూడో స్థానంలో ఉంది. ఈనెలాఖరున పాకిస్థాన్‌తో సొంతగడ్డపై జరుగబోయే రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో ఒక్కటి గెలిచినా సఫారీలు డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంటారు. భారత్ విషయానికొస్తే.. ఆసీస్‌తో ఆడబోయే మిగిలిన మూడు మ్యాచ్‌లలో గెలిస్తేనే మిగతా సమీకరణాలతో సంబంధం లేకుండా మూడోసారి ఫైనల్‌కు చేరుకునే అవకాశముంటుంది.

